

10న పండుగలా 'పీటీఎం': కలెక్టర్



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈనెల పదో తేదీన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల మెగా సమావేశాన్ని (పీటీఎం 2.0) పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. పీటీఎం నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులు, వివిధ పాఠశాలల యాజమాన్యాలతో సమీక్షించారు. జిల్లాలో 178 ప్రైవేటు పాఠశాలలుండగా, 36,596 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. అన్ని యాజమాన్యాల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, గిరిజన, సాంఘిక, వెనుకబడిన తరగతుల సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో పీటీం నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకోసం ఆయా పాఠశాలల ప్రాంగణాలను సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. తల్లిదండ్రులను విద్యార్థులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించాలన్నారు. జిల్లా స్థాయి సమావేశం జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతుందని చెప్పారు. సమావేశాలకు సర్పంచ్, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభించి, మధ్యాహ్నం భోజన విరామం సమయం వరకు సమావేశం ఉంటుందని తెలియజేశారు. తల్లిదండ్రులకు వారి పిల్లలకు సంబంధించిన సమగ్ర పురోగతి కార్డులను ఉపాధ్యాయులు అందిస్తారన్నారు. ఈ సందర్భంగా తల్లి పేరుతో మొక్క (ఏక్ పేడ్ మా కే నామ్ సే) నాటాలని కోరారు. డీఈవో వరలక్ష్మి, డిప్యూటీ డీఈవో ఎన్.ఇందిర, ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ, ఎంఈవో నటరాజ్, విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుప్పంలో నెలాఖరువరకు 30 పోలీస్ యాక్ట్

కుప్పం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కుప్పం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ ఈనెల ఒకటో తేదీనుంచి అమల్లో ఉందని.. 31వ తేదీ వరకు కొనసాగుతుందని డీఎస్పీ పార్థసారథి తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని కుప్పం అర్బన్, గుడుపల్లె, రాళ్లబూదుగూరు, రామకుప్పం పోలీసు స్టేషన్ల పరిధిలో 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా సభలు, సమావేశాలు జరుగకూడదన్నారు. ఒకవేళ జరపాలనుకుంటే ఏడ్రోజులు ముందుగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. అలాగే సమావేశం నిర్వహించదలచిన స్థలం యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే సంబంధితశాఖల అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. వీఐపీ పర్యటన ఉంటే ముందుగానే సమయం, రవాణా, జనసమీకరణ తదితర అంశాలను తెలియజేయాలన్నారు. మైక్‌లో మాట్లాడదలచిన వారు ఇతరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని సూచించారు. ఎలాంటి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించే వారిపై.. అందులో పాల్గొనే వారిపైనా చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

ఇప్పుడొచ్చి చేసేదేమిటి జగన్?

ముగుస్తున్న మామిడి సీజన్



- ఇప్పటికే 2.42 లక్షల టన్నుల కొనుగోళ్లు
- 15 రోజుల్లో మిగిలిన కాయల అమ్మకాలు

మామిడి సీజన్ రెండు వారాల్లో ముగియనుంది. కష్టకాలమంతా వదిలేసి, ఆఖరి రోజుల్లో మామిడి రైతు కన్నీళ్లు తుడవడానికంటూ వైసీపీ అధినేత జగన్.. చిత్తూరు జిల్లా పర్యటనకు వస్తుండడం పట్ల అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 9న ఆయన బంగారుపాళ్యంలోని ఒక మామిడికాయల మండీని సందర్శించనున్నారు. నిజానికి గుజ్జు పరిశ్రమలు మామిడి కాయలు కొనుగోలు చేయడానికి సుముఖంగా లేని రోజుల్లో రైతులు అల్లాడిపోయారు. చంద్రబాబు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు రూపాయల సబ్సిడీ ప్రకటించాకే పరిశ్రమల్లో కొనుగోళ్లు మొదలయ్యాయి. దీంతో మామిడిలోడ్లతో ట్రాక్టర్లు బారులు తీరాయి. ఈ కాలమంతా ప్రకటనలకే పరిమితం అయిన మాజీ సీఎం జగన్‌రెడ్డి సీజన్ ముగిసే సమయానికి వచ్చి ఓదార్చడం వల్ల రైతులకు ఏమి ప్రయోజనం ఉంటుందనే చర్చ జరుగుతోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఫ్యాక్టరీల్లో, ర్యాంపుల్లో కలిపి ఇప్పటికే 2.42 లక్షల టన్నుల మామిడి కాయల్ని కొనుగోలు చేశారు. 1.48 లక్షల టన్నుల కాయలు ఇంకా పొలాల్లో ఉన్నాయని అంచనా. రెండు వారాల్లో మొత్తం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇక తిరుపతి, అన్నమయ్య జిల్లాలతో పోల్చుకుంటే చిత్తూరు జిల్లాలోనే మామిడి అధికం. చిత్తూరు జిల్లాలో ఈ మామిడి ప్రాసెసింగ్ ప్రక్రియ ఇంకా రెండు వారాలకు పైబడి ఉండేలా కాయలు మిగిలి ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో ఇప్పటికే ప్రక్రియ పూర్తయింది. తిరుపతి జిల్లాలో నాలుగైదు రోజులు ఉండే అవకాశం ఉంది. చిత్తూరు జిల్లాలో ఈసారి 5 లక్షల టన్నుల తోతాపురి దిగుబడి వచ్చినట్లు అంచనా. ఇందులో సీజన్ ప్రారంభంలోనే పచ్చళ్ల కోసం కొన్ని మామిడి కాయలు అమ్ముడైపోయాయి. అలాగే కలర్ తోతాపురిని మంచి ధరలకు బయట అమ్ముకున్నారు. పచ్చళ్లకు, కలర్ కాయలు కలిపి 40వేల టన్నులు అమ్ముడయ్యాయి. 1.76 లక్షల టన్నుల కాయల్ని ఆయా ఫ్యాక్టరీలు కొనుగోలు చేయగా.. కిలోకు రూ.5 నుంచి రూ.6 మధ్యలో ఫ్యాక్టరీలు రైతులకు ఇచ్చాయి.

తోతాపురి అమ్మకాలు ఇలా...

జిల్లా	మొత్తం సేకరణ (టన్నుల్లో..)	ఫ్యాక్టరీల్లో (టన్నుల్లో..)	ర్యాంపులు (టన్నుల్లో..)
చిత్తూరు	2.42 లక్షలు	1.76 లక్షలు	66 వేలు
తిరుపతి	62 వేలు	41వేలు	21 వేలు
అన్నమయ్య	16 వేలు	15వేలు	వెయ్యి

బయటి ప్రాంతాల ర్యాంపులకు తరలింపు

జిల్లాలోని ర్యాంపులు రూ.2, రూ.3 మాత్రమే ఇస్తున్న సమయంలో రైతులు కృష్ణగిరి వంటి బయటి ప్రాంతాల్లోని ర్యాంపులకు కాయలు తరలించారు. ఇలా 66వేల టన్నుల కాయల్ని బయటి ప్రాంతాల ర్యాంపుల్లో అమ్ముకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

70వేల టన్నుల కాయల వేస్టేజ్

సుమారు 70వేల టన్నుల కాయలు తొందరపాటు/ఆలస్యంగా కోత వల్ల, కుళ్లిపోవడం వల్ల పాడైపోయాయి. ప్రతి సంవత్సరం వచ్చిన దిగుబడిలో 10 నుంచి 12 శాతం మధ్యలో ఇలాంటి వేస్టేజ్ ఉంటుంది. ఈసారి దిగుబడి అధికంగా ఉండడంతో వేస్టేజ్ కూడా ఎక్కువగా ఉంది. ఇక మిగిలిన 1.48 లక్షల టన్నుల కాయల్ని ప్రాసెసింగ్ చేస్తున్నారు. సుమారు రెండు వారాల్లో ప్రాసెసింగ్ ప్రక్రియ పూర్తవుతుందని తెలుస్తోంది.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు క్రీడలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతులు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో బాలాజి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదిలోపు https://apsportsschool.ap.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాల్గవ తరగతికి బాలురు 20, బాలికలు 20 మొత్తం 40, 5వ తరగతికి బాలురకు 20, బాలికలకు 20 చొప్పున 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు పైనున్న వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ఒంటరి ఏనుగుపై అధికారుల నిఘా

- పంటలకు రక్షణగా చర్యలు

మొర వినండి.. న్యాయం చేయండి

- కలెక్టరేట్‌లో 'పీజీఆర్ఎస్'కు 332 అర్జీలు

7లో

వానల కోసం.. వలస దేవర

రామకుప్పం/శాంతిపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితుల నుంచి కాపాడాలని.. వానలు కురవాలంటూ ఏడు గ్రామాల ప్రజలు గ్రామాలు వదిలి వలసదేవర చేశారు. వరుణుడు కరుణించని ప్రతిసారీ శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయితీకి చెందిన కర్లగట్ట, తుమ్మిగానిపల్లె, చిన్నకర్లగట్ట, కాళిగానూరు, బెల్లప్పకొటాలు, ప్రీతిచామనూరు, మంకప్పకొట్టాలు గ్రామాల ప్రజలు ఒక రోజు తమ గ్రామాలను వదిలి కర్లగట్ట సమీపంలోని బాలచెరువుకు చేరుకుంటారు. అక్కడ వలస దేవర చేయడంగా ఆచారంగా వస్తోంది. ఈసారి వానాకాలం ప్రారంభమైనా.. వానలు కురవక పోవడంతో సోమవారం ఏడు గ్రామాల ప్రజలు తమ గ్రామాలకు ఉన్న అన్ని దారులను ముళ్ల కంపలతో మూసివేశారు. ఉదయం ఆరు గంటలకే అన్ని కుటుంబాలవారు ఇళ్లలోని పశువులు, గొర్రెలతోపాటు నిత్యావసర వస్తువులను తీసుకుని.. బాలచెరువు వద్దకు దీపాలతో ఊరేగింపుగా వెళ్లారు. అక్కడే వంటావార్పు చేసుకున్నారు. మధ్యాహ్నం తర్వాత అమ్మవారికి దీపారాధనలు చేశారు. చీకటిపడ్డాక గ్రామాలకు చేరుకుని గ్రామదేవతలకు జంతుబలులిచ్చాక ఇళ్లలోకి వెళ్లారు.





బాలచెరువు వద్ద జనసందడి - వలసదేవరకు ఊరేగింపుగా వెళ్తున్న ఏడు గ్రామాల ప్రజలు

ఉనికి కోసమే వైసీపీ దుష్ప్రచారం

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్



చిత్తూరు సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ తన ఉనికి కోసమే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ విమర్శించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం వైసీపీ చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాటి వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు అక్రమ కేసుల్లో జైళ్లకు వెళుతున్నారని, దాన్నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. జగన్ 85 శాతం హామీలను ఉల్లంఘించినందుకే ప్రజలు వైసీపీని తిరస్కరించారన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 700కుపైగా మంచి పనులుచేసి ప్రజల మన్ననలు పొందిందని చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం పథకం అమలు చేయనున్నామని చెప్పారు.

న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యం

- మహిళ నుంచి పెట్రోల్ బాటిళ్లను లాక్కున్న పోలీసులు
- సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ



బాధితురాలి నుంచి పెట్రోల్ బాటిళ్లను తీసుకుంటున్న పోలీసు

చిత్తూరు అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తన స్థలాన్ని ఆక్రమించుకున్నా అధికారులు పట్టించుకోలేదంటూ పెట్రోలు బాటిళ్లతో వచ్చిన మహిళను పోలీసులు నిలువరించారు. వివరాలు ఇలా.. పెద్దపంజాణి మండలం కొలత్తూరుకు చెందిన విజయలక్ష్మికి గ్రామంలో తన ఇంటి ఎదురుగా కొంత ప్రభుత్వస్థలం ఉంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించాడు. ఆమె స్థానిక రెవెన్యూ అధికారులను కలిసింది. పట్టించుకోకపోవడంతో ఆర్డీవో వద్దకెళ్లి గోడును వెళ్లబోసుకుంది. అయినా ఫలితం లేకపోవడంతో పీజీఆర్ఎస్ కార్యక్రమానికి పదిసార్లు హాజరై జిల్లా అధికారులకు వినతిపత్రాలను అందిస్తూ వస్తోంది. వచ్చిన ప్రతిసారీ సంతకం చేసి ఆ అర్జీని తహసీల్దార్‌కు పంపేవారు. విచారించి తప్పుడు నివేదికను జిల్లా అధికారులకు ఇస్తున్నారని బాధిత మహిళ భావించింది. తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఈసారి న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని నిర్ణయించుకుంది. ఈక్రమంలో సోమవారం కలెక్టరేట్‌కు వచ్చింది. రెండు లీటర్ల పెట్రోల్ బాటిళ్ల తన బ్యాగులో తెచ్చుకుంది. అధికారులు న్యాయం చేయనిపక్షంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని మీడియా ఎదుట వాపోయింది. గమనించిన పోలీసులు వెంటనే ఆమె వద్ద నుంచి పెట్రోల్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. ఆమె సమస్యను విన్న కలెక్టర్ న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వెనుదిరిగింది.

విద్యుదాఘాతంతో ఎల్ఐసీ అధికారి మృతి



మృతిచెందిన వెంకటేశ్

కుప్పం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రకాశం రోడ్డులోని ఓ ఇంట్లో సోమవారం జరిగిన విద్యుత్తు ప్రమాదంలో ఓ ఎల్ఐసీ అధికారి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న వెంకటేశ్ (29) కుప్పం పట్టణంలోని ప్రకాశం రోడ్డులో కాపురం ఉంటున్నాడు. ఆయన శనివారం ఉదయం స్నానం చేసేందుకు బాత్రూంలో బకెట్‌లో నీళ్లు తీసుకుని, హీటర్ ఆన్ చేసి.. అందులో ఉంచేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా షార్ట్ సర్క్యూట్ కావడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పంటలపై కొనసాగుతున్న గజ దాడులు



ధ్వంసమైన మామిడిచెట్టు

కల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజ దాడులు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక వద్ద నుంచి బయల్దేరిన 16 ఏనుగుల గుంపు పాతపేట వద్దకు చేరుకున్నాయి. రైతు దొరస్వామికి చెందిన మామిడి, కొబ్బరి చెట్లను ధ్వంసంచేసి, పశుగ్రాసాన్ని తొక్కేశాయి. రైతులు రమేష్, సుబ్రహ్మణ్యం, మునస్వామి, జయరాం, గుర్రప్ప మామిడిచెట్లను కూడా ధ్వంసం చేశాయి. డ్రిప్‌పైపులు, ఫిల్టర్లను విరిచేశాయి. జయచంద్రకు చెందిన పశుగ్రాసాన్ని తొక్కి.. నాశనం చేశాయి. అనంతరం చల్లావారిపల్లె మీదుగా శ్రీనివాసపురం వద్దకు చేరుకున్నాయి. అక్కడినుంచి అడవిలోకి చేరుకున్న ఏనుగుల గుంపు సదుం మండలం చిట్టిగుట్ట మీదుగా తిరిగి గోగులమ్మ వంక వద్దకు చేరుకున్నాయని ఎఫ్‌బీవో శ్రీదేవి తెలిపారు.

ఆందోళనలో రైతులు

పాతపేట పంచాయతీ చిట్టారెడ్డిపేట సమీపంలో శనివారం రాత్రి ఓ ఏనుగు మృతి చెందిన నేపథ్యంలో ఈ ప్రాంతంలో మరో వారంపాటు ఏనుగుల గుంపు సంచరిస్తాయనే అటవీశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆగ్రహంతో ఉన్న ఏనుగుల గుంపు ఏమి చేస్తాయోనని నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోందని వాపోతున్నారు.



తమిళనాడు గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

శ్రీవారి సేవలో తమిళనాడు గవర్నర్

తిరుమల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణన్ రవి సోమవారం ఉదయం బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్, ఇండియన్ మిలటరీ అధికారి పరమవీర్‌చక్ర అవార్డు గ్రహీత యోగేంద్ర సింగ్ యాదవ్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.




ఆర్పీ ఠాకూర్



యోగేంద్ర సింగ్ యాదవ్

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.39 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 88,938

తలనీలాలు సమర్పించినవారు: 28,548

67,988 టన్నుల తోతాపురి కొనుగోలు

- 10,046 మంది మమిడి రైతులకు ప్రయోజనం
- చివరి పంట వరకూ రాయితీ అందిస్తామన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 7(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో ఈనెల నాటికి 67,988 టన్నుల తోతాపురి రకం మామిడి కాయలు కొనుగోలు అయ్యాయి. వీటిలో 45,338 టన్నులను మామిడిగుజ్జు పరిశ్రమలు సేకరించగా, మిగిలిన 22,650 టన్నులను ర్యాంపులు, మండీల్లో విక్రయించారు. తద్వారా 10,046మంది రైతులకు ప్రయోజనం చేకూరింది' అని కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం వివరించారు. మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. తోతాపురి మామిడి సేకరణ ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. నిర్దేశిత ధరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమల వద్ద క్యూలైన్లలో వేచి ఉన్న ట్రాక్టర్లు, ట్రక్కుల డ్రైవర్లు, రైతులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించామన్నారు. తోతాపురి మామిడి సేకరణ కోసం బ్యాంకులు 20 ప్రాసెసింగ్ యూనిట్లకు టాప్ అప్ మొత్తాన్ని ఇచ్చాయని, రైతులు తమ మొత్తం దిగుబడిని అమ్మవచ్చని తెలిపారు. చివరి పంట వరకూ ప్రభుత్వం తరపున రైతులకు రూ.4సబ్సిడీ ఇస్తామన్నారు. లీజుకు తీసుకున్న రైతులకూ ఇది వర్తిస్తుందన్నారు. ఆగస్టు నెలాఖరు వరకు తోతాపురి మామిడి కొనుగోలు జరుగుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 80వేల హెక్టార్లలో తోతాపురి మామిడి సాగులో ఉండగా, తిరుపతి జిల్లాలో 14,582 హెక్టార్ల విస్తీర్ణంలో 1.5లక్షల టన్నుల తోతాపురి ఉత్పత్తి ఉంటుందన్నారు. తోతాపురి మామిడి కిలో రూ.12 ధర నిర్ణయించడం జరిగింది. మామిడిగుజ్జు పరిశ్రమలు రూ.8, ప్రభుత్వం రూ.4 అందజేయడం జరుగుతుందన్నారు.

గోవిందరాజస్వామి ఆలయంలో కవచ ప్రతిష్ఠ



తిరుపతి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో జ్యేష్ఠాభిషేకంలో భాగంగా రెండో రోజైన సోమవారం కవచ ప్రతిష్ఠ క్రతువు వేడుకగా జరిగింది. ఉదయం శతకలశ స్నపనం, మహాశాంతిహోమం చేపట్టారు. ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సమర్పణ, ఆరగింపు, అనుగ్రహం వంటి కైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం ఉత్సవర్లు తిరుచ్చిపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దజియ్యంగార్, చిన్నజియ్యంగార్, ఆలయ డిప్యూటీఈవో శాంతి, ఏఈవో మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సత్యప్రసాద్

ప్రతి అర్జీకీ సమాధానమివ్వండి

పీజీఆర్ఎస్ ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనన్న అనగాని - కలెక్టరేట్‌లో వినతులు స్వీకరించిన మంత్రి

తిరుపతి (కలెక్టరేట్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించడానికే పీజీఆర్ఎస్ ఉందని, ఇందులో వచ్చే ప్రతి అర్జీకి సమాధానం ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం డిస్ట్రిక్ట్ విజన్ యాక్షన్ ప్లాన్, పీ4పై సమీక్షించడానికి అనగాని సత్యప్రసాద్ జిల్లా అధికారులతో సమీక్షించడానికి విచ్చేశారు. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలు ఒక్కొక్కరికిగా తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి నేరుగా వినతులను స్వీకరించారు. స్టేజ్ కిందనే కూర్చుని ఉన్న దివ్యాంగులతో నేలపై కూర్చుని వారి సమస్యలు తెలుసుకున్నారు. సహాయ పరికరాలు ఇవ్వలేదని, నిరుపేదలైన దివ్యాంగులకు ప్రభుత్వం షాపింగ్ కాంప్లెక్సుల్లో కొన్ని గదులు కేటాయించి జీవనోపాధి కల్పించాలని, త్రీవీలర్ బ్యాటరీ సైకిళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని పీడబ్ల్యూడీ ఫెడరేషన్ నాయకులు సుబ్రహ్మణ్యం, మస్తాన్ సాహెబ్ మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని పక్కనే ఉన్న కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 284 అర్జీలు అందాయి. అందులో అత్యధికంగా 149 రెవెన్యూకు సంబంధించినవే ఉన్నాయి. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగర పాలక సంస్థ కమిషనర్‌ఎ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, రోష్మాండ్, ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



పెరుమాళ్లపల్లెను ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలి

తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె గ్రామాన్ని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా విభజించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి టీడీపీ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, గ్రామస్థులు మంత్రిని కోరారు. పెరుగున్న జనాభా, భౌగోళిక విస్తీర్ణం కారణంగా ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసి, సర్వే నంబర్లు కూడా విభజించాలన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

మా భూమిని వేరేవారు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు..



'సార్! నా పేరు భారతి. తిరుపతి ఐఎస్ మహల్ వద్ద ఉంటున్నాం. నా భర్త ఆనంద్ 2023 జనవరిలో ప్రమాదవశాత్తు మరణించారు. ముగ్గురు పిల్లలున్నారు. ఎలాంటి ఆదాయమూ లేదు. తిరుపతి రూరల్ మండలం చిగురువాడ ఉత్తరపుకండ్రిగ వద్ద ప్లాట్ ఉంది. నా భర్త మరణించిన 4వ రోజే వేరే వ్యక్తి ఆ ప్లాట్‌ను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు' అని మంత్రి దృష్టికి తెచ్చింది. ఇదే విషయాన్ని గతంలో మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా రిజిస్ట్రేషన్ రద్దు చేసి న్యాయం చేయాలని ఆదేశించారని గుర్తు చేశారు. స్పందించిన మంత్రి జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులను పిలిచి సమస్యను వెంటనే పరిష్కరించి, బాధితురాలికి న్యాయం చేయాలని ఆదేశించారు.

నా ఇంటి స్థలం కబ్జా చేశారు



బెంగళూరులో ఉన్న కుమార్తె ఇంటికి పోయి వచ్చే లోపు నా ఇంటి జాగాను గ్రామానికి చెందిన లీలావతి కుటుంబీకులు ఆక్రమించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు కూడా కూడా ఆక్రమించిన కుటుంబానికే అండగా నిలుస్తున్నారు. నిరుపేద దళితురాలినైన నన్ను బెదిరిస్తున్నారు. న్యాయం చేయండి.

- తలారి రాజేశ్వరి, కొంగరవారిపల్లె, చంద్రగిరి మండలం

పింఛను ఇప్పించండి



అయ్యా! కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడిని. ఏడు నెలల క్రితం పక్షవాతంతో కాళ్లు, చెయ్యి పడిపోయాయి. కుటుంబ పోషణ కష్టంగా మారింది. పింఛను ఇచ్చి ఆదుకోండి.

- డి.అయ్యర్, తిరుపతి రూరల్

అభివృద్ధిలో జిల్లాను మొదట నిలుపుదాం

ఐదు రంగాల్లో వనరులు, అవకాశాలను అందిపుచ్చుకోవాలి

బంగారు కుటుంబాల అభివృద్ధికి శ్రద్ధ చూపాలి ● ప్రజాప్రతినిధులు, అధికారులకు ఇంఛార్జి మంత్రి పిలుపు



ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అనగాని

తిరుపతి, జూలై7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో జిల్లాను మొదటి స్థానంలో నిలపడానికి ఐదు ప్రధాన రంగాల్లోని వనరులను, అవకాశాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగిన జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశంలో పీ4 సర్వే, బంగారు కుటుంబాల అభివృద్ధి తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. 'జిల్లాలో పీ4 సర్వేలో 80,331 బంగారు కుటుంబాలను గుర్తించాం. ఇప్పటి వరకూ ఐదు మంది దాతలు 1911 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అంగీకరించారు' అని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. 'సీఎం చంద్రబాబు రూపొందించిన విజన్ 2047 డాక్యుమెంట్‌లో భాగంగా 2029 నాటికి జిల్లాను ఎంత వరకూ అభివృద్ధి పరచగలమో ఆలోచించండి. విజన్ యాక్షన్‌ప్లాన్ ద్వారా చరిత్రలో తొలిసారి ఎమ్మెల్యేలకు నియోజకవర్గ స్థాయిలో కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయి' అని మంత్రి అనగాని వివరించారు. తిరుపతిలో పేదలు నిర్మించుకున్న ఇళ్లకు జీవో 30 అమలు చేసేలా స్పెషల్ డ్రైవ్ పెట్టాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, ఏపీ హస్తకళల అకాడమీ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, జేసీ శుభం బన్సాల్, కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పలు అంశాలు ప్రస్తావించగా, మంత్రి, కలెక్టర్ స్పష్టత ఇచ్చారు.

సీఎస్ఆర్ నిధుల వ్యయంలో పారదర్శకత ఏదీ?

'శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరిశ్రమలు ఎక్కువ ఉన్నాయి.సీఎస్ఆర్‌కింద ఎన్ని నిధులు ఇస్తున్నాయి? ఎక్కడ ఖర్చు చేస్తున్నారనే అంశంలో పారదర్శకత ఉండటంలేదు. ఆవివరాలు ఆన్‌లైన్‌లో పెట్టాలి. కొంత శాతాన్ని స్థానిక నియోజకవర్గంలో ఖర్చు చేయాలి'అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు.

బంగారు కుటుంబాల జాబితా ఇవ్వండి

'పీ4 సర్వే ద్వారా గుర్తించిన బంగారు కుటుంబాల జాబితా ఎమ్మెల్యేలకు ఇవ్వాలి. పరిశ్రమలు సీఎస్ఆర్ కింద ఇస్తున్న నిధుల వివరాలు ఇవ్వడంతో పాటు యజమానులతో సమావేశం ఏర్పాటు చేస్తే బాగుంటుంది' అని ఎమ్మెల్యే సునీల్ కుమార్ అభిప్రాయపడ్డారు.

సీఎస్ఆర్ నిధులతో రోడ్లు బాగు చేయాలి

'శ్రీసిటీలో 220.. వెలుపల అపోలో, హీరో, క్యాప్రికార్న్ వంటి పరిశ్రమలూ ఉన్నాయి. సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలోని రోడ్లు బాగు చేయాలి. పర్యాటక ప్రాంతాల్ని అభివృద్ధి పరచాలి. మోటర్ బైక్ ఉంటే బంగారు కుటుంబాల జాబితా నుంచి తొలగించడం సరికాదు' అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపండి

'వెంకటగిరి నియోజకవర్గంలో భూములున్నా పారిశ్రామిక వాడలు ఏర్పాటు కాలేదు. దీనిపై చొరవ చూపాలి. ప్రత్యామ్నాయంగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి పరచాలి' అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు.

టెంపుల్ టూరిజంపై దృష్టి పెట్టాలి

'తిరుపతిలో పరిశ్రమలు, వ్యవసాయం, ఐటీ కంపెనీలూ లేవు. ఉన్నదల్లా సర్వీస్ సెక్టర్ మాత్రమే. టెంపుల్ టూరిజం అభివృద్ధి పరచాలి. దానికి కమిటీ వేసి నిపుణులను నియమించాలి' అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు.

పారిశుధ్యం అధ్వానం

'తిరుపతిలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండి.. ప్రజల ఆరోగ్యం దెబ్బతినేలా వుంది. వీధుల్లో రోడ్లు, డ్రైన్లు సక్రమంగా లేవు. ప్రత్యేక నిధులు కేటాయించి పరిస్థితిని మెరుగుపరచాలి' అని ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ విజ్ఞప్తి చేశారు.

ఇళ్లను క్రమబద్ధీకరిస్తే రూ. 400 కోట్లు

'తిరుపతి రూరల్ మండలంలో మఠం భూములను కొని 30 ఏళ్ల కిందట ఇళ్లు కట్టుకున్నారు. ప్రభుత్వం రోడ్లు, కాలువలు నిర్మించి కరెంటు కూడా ఇచ్చింది. మఠం భూములనే పేరుతో నిషేధిత జాబితాలో పెట్టారు. దాంతో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. నిషేధిత జాబితా నుంచీ ఆ భూములను తొలగించి క్రమబద్ధీకరిస్తే ప్రభుత్వానికి రూ. 400 కోట్ల వరకూ ఆదాయం వస్తుంది. కావాలంటే మఠానికి ప్రత్యామ్నాయ భూములిస్తాం' అని ఎమ్మెల్యే పులివర్తి నానీ సూచించారు.

నైపుణ్య శిక్షణలో ఎస్వీయూ సహకారం

'యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ఎస్వీయూ సహకరిస్తుంది. ఇప్పటికే డ్రోన్ అండ్ స్పేస్ టెక్నాలజీ అంశంలో ఎంవోయూ కుదుర్చుకున్నాం. తిరుపతి, పరిసర ప్రాంతాల్లో డ్రోన్ వినియోగంపై శిక్షణ, ఆపరేషన్, రిపేర్లు వంటివి చేపడతాం. ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు శిక్షణ ఇస్తాం' అని వీసీ అప్పారావు పేర్కొన్నారు.

మహిళాభివృద్ధికి తోడ్పాటు

'మహిళలకు ఉన్నత విద్య, నైపుణ్య శిక్షణకు పద్మావతీ వర్సిటీ తోడ్పడుతుంది. ఏఐ, ఫ్యాషన్ టెక్నాలజీ తదితరాలపై దృష్టి పెడుతున్నాం. ఇప్పటికే 47 స్టార్టప్‌లు వున్నాయి. మహిళా బయోటెక్ పార్కు వుంది. తిరుపతిలో రెండు మురికివాడలు కేటాయిస్తే విద్యార్థులను పంపి పరిస్థితులు మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తాం. ఇంటర్న్‌షిప్స్ నిర్వహిస్తాం. పూర్వ విద్యార్థులను పీ4లో భాగస్వాముల్ని చేస్తాం' అని వీసీ ఉమా తెలిపారు.

విద్యార్థులు.. ఉపాధ్యాయులు 100శాతం హాజరు

- రాష్ట్రంలో జిల్లా విద్యాశాఖ రికార్డ్



100 శాతం హాజరు పోస్టర్లను ప్రదర్శిస్తున్న డీఈవో

తిరుపతి(విద్య), జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ రాష్ట్ర స్థాయిలో అరుదైన రికార్డ్‌ను సాధించింది. అన్ని పాఠశాలల్లో నమోదైన విద్యార్థులు, అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సోమవారం వందశాతం పాఠశాలలకు హాజరయ్యారని డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. పాఠశాలలు ప్రారంభమైన కొద్దిరోజుల్లోనే... ఈ అరుదైన రికార్డును సాధించడంపట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 100 శాతం హాజరు నమోదు చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ నిత్యం వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా మార్గనిర్దేశం చేస్తూ వచ్చారని... ఆమేరకు రాష్ట్రంలో జిల్లా ఆ ఘనతను సాధించందన్నారు. ఉన్నతాధికారులు డీఈఓ ఇతర అధికారులను అభినందించారు. 100 శాతం హాజరుకు కృషి చేసిన అధికారులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు డీఈవో కుమార్, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.గౌరీశంకర్‌రావు, ఫషియల్ అటెండెన్స్ నోడల్ అధికారి జి.సురేష్ అభినందనలు తెలియజేశారు.

భరతనాట్యంలో వరల్డ్ రికార్డు



వరల్డ్‌రికార్డు సర్టిఫికెట్లు చూపుతున్న బాలికలు

తిరుపతి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): నటరాజ నర్తన ఆకారంలో 27.32 నిమిషాల పాటు భరతనాట్యంతో తిరుపతికి చెందిన బాలికలు వరల్డ్ రికార్డును కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తమిళనాడు సేలంలోని కైలాస మానససరోవరం స్కూల్‌గ్రౌండ్‌లో ఇంటర్ నేషనల్ టైమ్స్ అండ్ వరల్డ్ రికార్డు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం భరతనాట్యంలో 'నటరాజ నర్తనం' ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2వేల మంది బాల కళాకారులు ప్రాతినిత్యం వహించారు. అందులో తిరుపతి నుంచి సింహాల లేక్షణ సాయి, కందుల హవిష, బి.ప్రశ్వితశ్రీ, సి.కేతన పాల్గొని నటరాజనర్తన ఆకారంలో 27.32నిమిషాలు నృత్యం చేసి అహూతులను అబ్బురపరిచారు. తమిళ సినీనటి, క్లాసికల్ డ్యాన్సర్ ప్రియదర్శిని చేతుల మీదుగా నలుగురు బాలికలు ప్రశంసపత్రాలు, బహుమతులు అందుకున్నారు.

ఆగస్టు 7న గోవాలో జాతీయ ఓబీసీ మహాసభ

తిరుపతి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గోవాలోని శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో వచ్చేనెల ఏడో తేదీన జాతీయ ఓబీసీ మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, కేశన శంకరరావు తెలిపారు. తిరుపతిలోని పద్మావతి గెస్ట్‌హౌస్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి, బీసీ డిమాండ్ల సాధన కోసం, భవిష్యత్తు కార్యచరణను రూపొందిస్తామన్నారు. ఈనెల 21నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాలలో ఈ బిల్లుపై చర్చించి చట్టసభలలో బీసీలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. 2026లోనే కులగణన పూర్తిచేసి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని కోరారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో విద్య, ఉద్యోగాలలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని సరిదిద్దే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలన్నారు. సభకు ప్రధాని మోదీ, మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు, అఖిలపక్ష పార్టీల అధ్యక్షులు, జాతీయస్థాయి నేతలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతికుమార్‌యాదవ్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం వాటా కోసం పోరాటానికి బీసీలందరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొబ్బినేని రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగుపై అధికారుల నిఘా

● పంటలకు రక్షణగా చర్యలు



ననియాల అటవీ సమీపంలో తిరుగుతున్న ఒంటరి ఏనుగు

రామకుప్పం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని ననియాల గ్రామస్తులను 15 రోజులుగా భయభ్రాంతులకు గురిచేస్తున్న ఒంటరి ఏనుగు ఆదివారం రాత్రి పొలాలు, తోటల వైపు రాకుండా అటవీ అధికారులు ట్రాకర్లతో కలిసి అడవిలోకి తరిమేశారు. రోజూ ఏనుగు గ్రామ సమీప పొలాలు, తోటలపై దాడులు చేస్తూ అపారమైన నష్టాన్ని కలిగిస్తోంది. ఏ క్షణంలో గ్రామానికొస్తుందోనని ఆందోళనతో గ్రామస్తులు హడలిపోతున్నారు. అటవీ అధికారులు ఎంత ప్రయత్నం చేసినా అది పొలాలు, తోటల వైపు రాకుండా నిరోధించలేక పోయారు. ఆదివారం రాత్రి ఎలాగైనా ఏనుగును అడవిలోకి తరమాలని అటవీ అధికారులు, ట్రాకర్లు, గ్రామస్తులు గ్రామం నలు దిక్కులా అటవీ సరిహద్దుల్లో కాపుకాచారు. ఏనుగు అడవి నుంచి వచ్చిన వెంటనే సమాచారం అందుకున్న అధికారులు బాణసంచా పేలుస్తూ తిరిగి అడవిలోకి వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఏనుగు పంటలవైపు వచ్చిన సమయంలో రైతులు తరిమే ప్రయత్నం చేయరాదని సూచించారు. సమాచారం అందిస్తే తాము చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎంపీ దగ్గుమళ్ల

వెదురుకుప్పం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు పరిధిలోని పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సోమవారం అందజేశారు. తన కార్యాలయంలో 8మందికి ఆయన రూ.13,27,560 అందజేశారు. పెనుమూరు మండలం పెలితళ్లకు చెందిన ఎస్.నాదమునికి రూ.42,746,జీడీనెల్లూరు మండలం వింజం గ్రామానికి చెందిన కె.మోహన్‌రెడ్డికి రూ.44,195, ఐరాల మండలం పొలకల గ్రామానికి చెందిన బేబీప్రత్యూషకు రూ.35,917, పుంగనూరు తేరువీధికి చెందిన బి.విజయకుమార్‌కి రూ.2లక్షలు, ఐరాలకు చెందిన రాజారెడ్డికి రూ.1,15,000, వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లెకు చెందిన రవిబాబుకురూ.2.09,945, చిత్తూరు మండలం రామాపురానికి చెందిన దేవేంద్రబాబు రూ.51,385, తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటకు చెందిన జి.గిరిబాబుకు రూ.6,28,372 అందజేశారు.

అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నా.. ఆదుకోండి

● టీడీపీ నాయకుడి ఆవేదన



చికిత్స పొందుతున్న రెడ్డెప్ప

పుంగనూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న తనను ఆదుకోవాలని పుంగనూరు ఎన్‌ఎస్‌పేట రామ్‌నగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు రెడ్డెప్ప అభ్యర్థిస్తున్నాడు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. తొలి నుంచి టీడీపీ కార్యకర్తగా పార్టీ కోసం పని చేశానని.. గత మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి, ప్రస్తుత మున్సిపల్ వైస్ చైర్మన్ కొండేటి నాగేంద్రపై పోటీకి దిగానన్నారు. కొంతకాలంగా తీవ్ర కడుపునొప్పితో ఇబ్బంది పడుతూ ఆపరేషన్ చేయించుకున్నానని.. షుగర్ వ్యాధి కారణంగా పేగుల్లో ఇన్‌ఫెక్షన్ రావడంతో ఇబ్బందులు పడుతున్నానన్నారు. మరో ఆపరేషన్ చేయించుకోవడంతో ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఉన్న ఇల్లు అమ్ముకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజులుగా మదనపల్లెలో చికిత్సలు పొందుతూ ఇబ్బందులు పడుతున్నానని, దాతలు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. సాయం చేయదలిచిన దాతలు ఫోన్‌నంబర్ 99084 68960ను సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి: పీఆర్‌టీయూ

చిత్తూరు సెంట్రల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఎన్ కన్నన్, విజయభాస్కర్‌లు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ చెల్లింపులు చేపట్టాలని, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని, 11వ పీఆర్సీకి సంబంధించి బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయులు సరెండర్ లీవు చాల కాలం నుంచి పెండింగ్‌లో ఉన్నందున, వీటి చెల్లింపులతో పాటు మూడు పెండింగ్ డీఏలు చెల్లించి, పీఆర్సీ కమిషన్‌కు ఛైర్మన్ నియామకంతో పాటు ఐఆర్ 30 శాతం చెల్లించాలని, సీపీఎస్ విధానం రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు.

నిరుద్యోగులను టీటీడీ ఆదరించాలి



నిరుద్యోగులకు అన్నం వడ్డిస్తున్న నారాయణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 7 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుపేద విద్యార్థులకు వసతి, భోజన సదుపాయాలు కల్పించేలా చూడాలని టీటీడీకి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీ లైబ్రరీ వద్ద పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులను ఆయన పలకరించారు. ఉన్నత చదువులు చదివి ఆర్థిక సమస్యలతో నిరుద్యోగులు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి రెండేళ్లుగా అన్నదానం చేస్తున్న వారిని అభినందించారు. టీటీడీ స్పందించి వసతి, భోజన సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

మొర వినండి.. న్యాయం చేయండి

● కలెక్టర్, జేసీ ఇతర అధికారులకు బాధితుల వినతి

● కలెక్టరేట్‌లో 'పీజీఆర్ఎస్'కు 332 అర్జీలు



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి అర్జీలు వెల్లువెత్తాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, ఇతర అధికారులు వినతులను స్వీకరించారు. ఆర్వో మోహన్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా 332 అర్జీలు అందాయి. వీటిల్లో రెవెన్యూశాఖకు 265, డీఆర్‌డీఏకు 25, పోలీసుశాఖకు 11, జిల్లాపంచాయతీరాజ్ శాఖకు 3, విద్యాశాఖకు 3, ఇతర శాఖలైన ఐసీడీఎస్, దేవదాయ, విద్యుత్, పౌరసరఫరాలు, మెప్మా, వ్యవసాయ, గృహనిర్మాణ, మున్సిపాలిటీ తదితర శాఖలకు 25 అర్జీల చొప్పున ఉన్నాయి.

అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని..

● దేవదాయశాఖ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఆర్‌పురం మండలం మంగుంట గ్రామస్థులు కోరారు. ఆవుదేవర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి సంబంధించి సర్వే నెంబరు 109-1లో 1.20 ఎకరాలు, 110-4లో 1.15 ఎకరాలను కొంతమంది ఆక్రమించుకున్నారన్నారు. ● తన భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని పెనుమూరు మండలం లచ్చుకూరుకు చెందిన ప్రమీల ఫిర్యాదు చేశారు. ● చౌకదుకాణంపై ఫిర్యాదులు లేకపోయినా పుల్లూరులో షాపు తొలగించి పి. ఒడ్డుపల్లెలోని ఎస్‌హెచ్‌జీ సభ్యుల చేత నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నారని పుల్లూరు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ● తాము నివాసముంటున్న గృహాలను క్రమబద్ధీకరించాలని పుంగనూరు మండలం మేలందొడ్డి పంచాయతీలోని గోపిశెట్టిపల్లె గ్రామస్తులు కోరారు. మాణిక్య వరదరాజస్వామిఆలయం పేరు మీద ఉన్న భూమిలోనే ఇండ్లు కట్టుకుని ఉన్నామన్నారు. తమ ఇళ్లను తొలగిస్తే కట్టుకునే పరిస్థితి లేదన్నారు. ● ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 13 నెలల జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. 13నెలలుగా ఉద్యోగులకు వేతనాలు లేకపోవడంతో కుటుంబాలు గడవటం కష్టంగా మారిందన్నారు.

రూ.15వేల పింఛను ఇవ్వండి

తనకు రూ.15వేల పింఛన్‌ను మంజూరు చేయాలని వెదురుకుప్పం మండలం ధర్మాచెరువుకు చెందిన గుణసుందరి కోరారు. గతంలో 50శాతం వికలాంగత్వం ఉన్నందున రూ.6వేల పింఛన్ ఇస్తున్నారన్నారు. ప్రస్తుతం చేతులు, కాళ్లు పడిపోవడంతో ఏ పనీ చేసుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.

బదిలీల ప్రక్రియలో అన్యాయం జరిగింది



వ్యవసాయ సహాయకులు

బదిలీల ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందని తిరుపతి జిల్లాలో సేవాకేంద్రాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులు ఆరోపించారు. ఆప్షన్ తీసుకున్నా వేరే ప్రాంతాలకు పోస్టింగ్‌లు ఇచ్చారన్నారు. స్పౌజ్, దివ్యాంగుల కోటాను విస్మరించారన్నారు.

ఆర్ఎంపీపై చర్యలు తీసుకోండి



బాధితురాలు కల్పన

తన సోదరి కల్పనకు మాటలు రావడం లేదని, చర్మంపై బొబ్బర్లు వచ్చాయని పలమనేరు మండలం కొలమాసనపల్లెకు చెందిన ఆమె సోదరుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఎంపీ వైద్యం వికటించిందన్నారు. బాధ్యుడైన ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసు కార్యాలయానికి 54 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 54 అర్జీలు అందాయి. ఇందులో భూ తగాదాలు 14, డబ్బు తగాదాలు 12, వేధింపులు 5, ఆస్తి తగాదాలు 4, కుటుంబ తగాదాలు 6, ఇంటి తగాదాలు 7, భర్త వేధింపులు 1, దారి సమస్యలు 1, సైబర్ క్రైమ్ 4 చొప్పున అర్జీలు అందాయి. బాధితుల నుంచి ఎస్పీ మణికంఠ చందోలు, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీటీసీ డీఎస్పీ రాంబాబులు అర్జీలను స్వీకరించారు.

పెద్దిరెడ్డి గడ్డలో మంత్రి రామ్‌ప్రసాద్‌కు ఘనస్వాగతం

● చల్లా నేతృత్వంలో పసుపుమయంగా చీకలచేను



రాంప్రసాద్‌రెడ్డిని, చల్లా బాబును గజమాలతో సత్కరిస్తున్న సదుం టీడీపీ శ్రేణులు

పుంగనూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ప్రతిపక్షాలను అష్టకష్టాలు పెట్టి.. ఉమ్మడి చిత్తూరు జిల్లాను శాసించిన పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత మండలం, వారి అడ్డాగా ఉన్న చీకలచేను గ్రామంలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి (బాబు)లకు ఘనస్వాగతం లభించింది. సోమవారం సదుం మండలం చీకలచేనులో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి పర్యటనను ఖరారు చేశారు. వైసీపీ నేత గడ్డగా ఉన్న సదుం అందులోనూ వారి గ్రామసమీపంలోనే కార్యక్రమం జరగడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది. మంత్రి పీలేరు నుంచి కల్లూరు, సదుం మండలం బూరగమంద మీదుగా టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబుతోకలిసి చీకలచేనుకు చేరుకున్నారు. ఇంటింటికీ మంత్రి స్వయంగా వెళ్లి సీఎం చంద్రబాబు ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈసందర్భంగా కొందరు గత ప్రభుత్వంలో భూముల రికార్డులు తారుమారు చేశారని.. 20 ఎకరాలు, 25 ఎకరాలు భూములన్నట్లు చూపి అర్హులైన తమకు తల్లికివందనం రాకుండా చేశారని వాపోయారు. పింఛన్లు మంజూరు చేయాలని, తదితర స్థానిక సమస్యలు తెలియజేయడంతో మంత్రి తీవ్రంగా స్పందించి తహసీల్దార్, ఎంపీడీవోలను పిలిపించి గ్రామంలో గత ప్రభుత్వంలో జరిగిన అవకతకలను సరిదిద్ది అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. కాగా, భారీ ఎత్తున క్రేన్‌ద్వారా ఏర్పాటు చేసిన గజమాలతో నాయకులకు స్వాగతం పలకగా.. గ్రామంలో టీడీపీ తోరణాలు, జెండాలు, ఫ్లెక్సీలతో పసుపుమయంగా మారింది. మరోవైపు మంత్రికి ప్రతి ఒక్క నేత, కార్యకర్తను చల్లా బాబు పరిచయం చేస్తూ మహిళలతో మాట్లాడించడంతో టీడీపీ శ్రేణుల్లో జోష్ కనిపించింది.

రణరంగం

● ధర్మరాజస్వామి ఉత్సవాల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

● అనంతరం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో భీకర దాడులు

● పరుగులు తీసిన రోగులు



ప్రభుత్వాస్పత్రి అత్యవసర విభాగం వద్ద కర్రలు, రాళ్లతో దాడి చేస్తున్న యువకులు

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆదివారం అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య దాడులు.. వీధి పోరాటాన్ని తలపించింది. సిబ్బంది ప్రాణరక్షణ కోసం గదిలోకి వెళ్లి దాక్కోవాల్సి వచ్చింది. రోగులు, వారి సంబంధీకులు ఏం జరుగుతుందో అర్థం కాక పరుగులు తీశారు. ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి అగ్నిగుండం తర్వాత జరిగిన కురుక్షేత్ర సంగ్రామం (యుద్ధపర్వం) ఘట్టం సందర్భంగా జరిగిన చిన్న వివాదమే.. ఈ దాడులకు కారణమైంది. ఆ ఉత్సవ సమయంలో ఆలయం వెనుక.. తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట పట్టణానికి చెందిన రోహిత్, ధనుష్ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నారు. అదే సమయంలో భాను, కిరణ్, చరణ్ ధర్మరాజస్వామి ఆలయం వైపు వెళుతుండగా వారితో వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. రోహిత్, ధనుష్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి కుటుంబసభ్యులైన మునిరత్నం, సుధాకర్, మునిరాజా గాయపడిన రోహిత్, ధనుష్‌ను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాసేపటికి భాను తన ఇద్దరు సోదరులతో పాటు మరికొంత మందిని వెంటబెట్టుకుని ఆస్పత్రికి వెళ్లారు. ఇరువర్గాలు కత్తులు, దుడ్డుకర్రలు, రాళ్లతో ఒకరిపై ఒకరు విరుచకపడ్డారు. కొందరు ప్రాణభయంతో తప్పించుకునే క్రమంలో కాన్పుల రూంలోకి చొరబడ్డారు. అక్కడ బాలింతలు, గర్భిణులు, నవజాత శిశువులు ఉన్నారు. ఆస్పత్రిలో రోగులంతా వణికిపోయారు. అక్కడే సమీపంలోనే నర్సింగ్‌స్టేషన్‌లో ఉన్న స్టాఫ్‌నర్సులు ప్రాణభయంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు కొందరు సెలైన్ స్టాండ్లతోనూ దాడికి దిగారు. ఆస్పత్రి సిబ్బంది సమాచారంతో శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, తన సిబ్బందితో ఆస్పత్రికి చేరుకున్నారు. ఇరువర్గాలు గాయాలతో రక్తస్రావం జరుగుతున్నా పోరు తగ్గలేదు. డీఎస్పీ చొరవతో అల్లరి మూకలను అదుపు చేశారు. ఇదే వైద్యశాలలో చికిత్సలందిస్తే మళ్లీ దాడులకు దిగుతారని భావించి.. మునిరత్నం, సుధాకర్, మునిరాజాను ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండేళ్ల కిందట కూడా ఈ రెండు ప్రాంతాల మధ్య ఆస్పత్రి వద్ద జరిగిన దాడుల నేపథ్యంలో వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆస్పత్రి యంత్రాంగం స్పందనేదీ?



అత్యవసర విభాగం వద్ద ధ్వంసమైన రెండు ద్విచక్ర వాహనాలు

అందుబాటులో ఉండాల్సిన ఆస్పత్రి సూపరింటెండెంట్ మణి, ఇన్‌చార్జి ఆర్ఎంవో మురళీకృష్ణ తిరుపతిలో నివాసం. నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టు ఖాళీ. ఆ తరువాత స్థానంలోని ముగ్గురు హెడ్‌నర్సులు ఉండేదీ తిరుపతిలోనే. అర్ధరాత్రి ఒంటి గంటకు ఇంత పెద్ద ఘటన జరిగితే సోమవారం ఉదయం ఆస్పత్రికి వచ్చారు. సీసీ కెమెరాల్లోని గొడవ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి.. పోలీసుల వైఫల్యంగా చూపేలా సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయించారన్న విమర్శలున్నాయి. ఇంత బీభత్సంపై నిరసన తెలపలేదు. కనీసం అవుట్ పోస్టు కావాలని పోలీసు అధికారులకు విజ్ఞప్తి కూడా చేయకపోవడం గమనార్హం.

డిజిటల్ పేమెంట్స్‌ను పరిశీలించిన టీటీడీ ఈవో



తిరుమల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో శ్యామలరావు సోమవారం తిరుమలలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. శ్రీవారి పుష్కరిణి, బంగారు డాలర్ల విక్రయ కేంద్రం, అగరబత్తి, కొబ్బరికాయల విక్రయ కేంద్రం, పబ్లికేషన్ స్టాళ్లను పరిశీలించారు. డిజిటల్ పేమెంట్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కొబ్బరికాయల విక్రయ కేంద్రంలో సిగ్నల్ లేకపోవడంతో డిజిటల్ పేమెంట్స్ చేసేందుకు భక్తులు ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించారు. ఈ క్రమంలో సమస్యను పరిష్కరించేందుకు పలు మార్గాలను అన్వేషించాలని, భక్తులకు డిజిటల్ పేమెంట్స్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని ఆదేశించారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



తిరుపతి(సెంట్రల్), జూలై7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో సోమవారం రైల్వే బోర్డు ప్రిన్సిపుల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలేంద్రసింగ్ తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఆరు ప్లాట్‌ఫారాల్లో ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. విశ్రాంతి గదులు, టికెట్ కౌంటర్లు, పలు కార్యాలయాలను సందర్శించారు. ప్రిన్సిపుల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ మధుసూదనరావు, ఏడీఆర్ఎం యు.సుధాకర్, డిప్యూటీ సీఈ వామనమూర్తి, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మేనేజరు డాక్టర్ కె.చిన్నపరెడ్డి, అధికారులు మణికంఠ, రమణరావు, ప్రభాకర్, మాధవరావు ఆయన వెంట ఉన్నారు.

అట్టహాసంగా అంధుల క్రికెట్ పోటీలు ప్రారంభం



తిరుపతి(క్రీడలు), జూలై 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని కేవీఎస్‌పార్కులో సోమవారం రాష్ట్రస్థాయి అంధుల క్రికెట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తిరుపతి జేసీఐ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఇన్‌సైట్ క్రికెట్ కప్ పేరుతో నిర్వహిస్తున్న ఈ రాష్ట్రస్థాయి టోర్నీని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ జాతీయ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎన్.బీ.హర్షవర్ధన్ ప్రారంభించారు. ఆరు జిల్లాల నుంచి వచ్చిన అంధుల క్రికెటర్లను పరిచయం చేసుకున్నారు. పట్టుదలతో ఆడి విజయం సాధించాలని కోరారు. అంధులకు ప్రత్యేక క్రీడా మైదానాలు, శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేయాలని అభిప్రాయపడ్డారు. మూడు రోజుల పాటు లీగ్ మ్యాచ్‌లు, చివరిరోజున అంతిమ పోరు ఉంటుంది. ఈ కార్యక్రమంలో జేసీఐ తిరుపతి శాఖ చైర్మన్ శేషసాయి, గట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు గట్ల శ్రీనివాసరెడ్డి, దివ్యాంగ సేవాకేంద్రం అధ్యక్షుడు ఎన్.మునిలక్ష్మి, బ్లైండ్ క్రికెట్ అసోసియేషన్ ఫౌండర్ జాన్‌డేవిడ్ పాల్గొన్నారు.

సైకో కలకలం

● దాడిలో భిక్షగాడి మృతి.. మరో ఇద్దరికి గాయాలు

● తిరుపతిలో పెరిగిపోతున్న మతిస్థిమితం లేని వ్యక్తులు

● స్థానికులు, భక్తుల్లో ఆందోళన



సైకోను వలేసి పట్టుకుంటూ.. సైకోను తీసుకెళుతున్న పోలీసులు, మృతిచెందిన భిక్షగాడు

కుటుంబంలో అనాదరణకు గురైన వారు. పక్కరాష్ట్రాలు, జిల్లాల్లోని కొందరు యాచకులు. మతిస్థిమితం లేనివారు. వీరందరికీ ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతి కేరాఫ్‌గా మారుతోంది. ఇలా వచ్చిన వారిలో కొందరి విపరీత పోకడలు స్థానికులు, భక్తులను ఇబ్బందులకు గురిచేస్తోంది. మాసిన ముఖం...పెరిగిన గడ్డం...చిరిగిన దుస్తులు ధరించి వీరు ఇటీవల తుడా సర్కిల్, లీలామహల్ రోడ్డు, మంగళం రోడ్డు, తిలక్ రోడ్డు, నంది సర్కిల్, అన్నారావు సర్కిల్, కపిలతీర్థం, గోవిందరాజ స్వామి ఆలయం, బస్టాండు, రైల్వే స్టేషన్ రోడ్డు, బాలాజీ కాలనీ, అలిపిరి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా సంచరిస్తున్నారు. ఎవరైనా వీరిలో కొందరి జోలికి వెళ్ళినా, వారిని పలకరించినా వెంటనే కర్రలు, కత్తులతో దాడులకు దిగుతున్నారు. కొన్ని సర్కిళ్లలో వాహనదారులకు అడ్డండపడి భిక్షాటన చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తున్నారు. ఇక, ఓ మహిళ భిక్షాటన సమయంలో ఎవరైనా డబ్బులు ఇవ్వకుంటే వారిని నానా బూతులతో తిడుతుంది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు తిరుపతిలో 60 నుంచి 70 మంది వరకు భిక్షగాళ్ళు, మతిస్థిమితం కోల్పోయిన వారు ఉన్నట్లు సమాచారం. ఈ మతిస్థిమితం కోల్పోయిన వారే ప్రవర్తనే కొన్ని సమయాల్లో సైకోల్లా ఉంటుంది. ఇలాంటి వారి ప్రవర్తనపై నిఘా ఉంచి.. వీరిని మానసిక వికలాంగుల ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పించాల్సిన పోలీసులు, మున్సిపల్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

> వాళ్లలో వాళ్లే మాట్లాడుకుంటూ ఉంటారు. జనం గుమికూడిన చోటికి వచ్చి బూతులతో తిడుతుంటారు. కుక్క లేదా ఏదైనా జంతువు కనిపిస్తే రోడ్డుపైకి రాళ్లు విసురుతారు. ఆ రాయి ఎక్కడ తగులుతుందోనని జనం, వాహనదారుల్లో ఆందోళన వ్యక్తమవుతుంటుంది. పిచ్చోళ్లలా ఉంటూ చేతిలో పెద్ద కర్రతో తిరిగే వారిని చూసి భయపడుతుంటారు. ఇలాంటి వారు తిరుపతి నగరంలో ఎక్కువవుతున్నారు. సోమవారం నాటి ఘటనతో ఆధ్యాత్మిక క్షేత్రంలో కలకలం రేగింది.
>
> - తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఇవీ ఘటనలు

● 15 రోజుల క్రితం తుడా సర్కిల్ వద్ద ఉదయం సమయంలో దిన సరి కూలీగా పనిచేస్తున్న రామస్వామిపై ఓ యాచకుడు దాడి చేశాడు. ఈ ఘటనలో అతను స్వల్పంగా గాయపడ్డారు. ● లీలామహల్ సర్కిల్ వద్ద ఫుట్‌పాత్‌పై భోజనం చేస్తున్న ఇద్దరు మహిళల వద్దకు వెళ్లిన ఒక మతి స్థిమితం కోల్పోయిన వ్యక్తి అన్నం పెట్టాలని అడిగాడు. వారు లేదని చెప్పడంతో తన చేతిలో ఉన్న కర్రతో కొట్టాడు. దీంతో ఒక మహిళ గాయపడింది. ● మూడు నెలల క్రితం లీలామహల్ నుంచి శివజ్యోతినగర్ వైపు నడచి వెళుతున్న ఒక యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ సమయంలో ఇద్దరు యువకులు అడ్డం పడ్డారు.

తాజా ఘటనతో కలవరం

చాలామందిలాగే తమిళనాడు నుంచి తిరుపతికి చేరిన ఓ మతి స్థిమితంలేని వ్యక్తి.. సోమవారం ఉదయం 7.15 గంటల ప్రాంతంలో నంది సర్కిల్ వద్ద వీరంగం చేశాడు. భిక్షగాడు శేఖర్‌తో గొడవకు దిగి తన చేతిలో ఉన్న కర్ర, కత్తితో తలపై మోదాడు. అడ్డొచ్చిన భిక్షగత్తె కల్పనను.. పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న తారకరామానగర్‌కు చెందిన సుబ్రమ్మణ్యంపైనా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన శేఖర్ మృతిచెందగా, మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన స్థానికులు, భక్తులను కలవరపాటుకు గురిచేసింది.

వలేసి సైకోను పట్టుకుని..

సమాచారం తెలిసిన వెంటనే అలిపిరి పోలీసులు అప్రమత్తమయ్యారు. భిక్షగాడిని హతమార్చిన సైకోను పట్టుకోవడానికి నానా తంటాలు పడ్డారు. మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి సమక్షంలో సిబ్బంది, అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు, స్థానికులతో కలిసి వలవేసి పట్టుకున్నారు. అలిపిరి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అతడి బ్యాగులో కత్తులు, కర్రలను సీజ్ చేశారు. నిందితుడిపై లునటిక్ యాక్టు కింద కేసు నమోదు చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం మంగళవారం రుయాకు తీసుకెళ్ళి కోర్టు ఎదుట హాజరుపరచి న్యాయమూర్తి ఆదేశాలతో వైజాగ్‌లోని పిచ్చాసుపత్రికి తరలిస్తామని అలిపిరి సీఐ రాంకిషోర్ ఆంధ్రజ్యోతికి చెప్పారు.



గాయపడిన కల్పన, సుబ్రహ్మణ్యం - నిందితుడి వద్ద దొరికిన కత్తులు

కుప్పం మీదుగా వందేభారత్ రైలు వేయాలి



రైల్వే ఏజీఎంతో మాట్లాడుతున్న తులసీనాథ్

కుప్పం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వందే భారత్ రైలును కుప్పం మీదుగా నడిపేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్‌ఎస్.తులసీనాథ్, రైల్వే ఏజీఎంను కోరారు. స్థానిక రైల్వే స్టేషన్ తనిఖీకు వచ్చిన ఏజీఎంను ఆయన సోమవారం కలిశారు. తులసీనాథ్ మాట్లాడుతూ బెంగళూరు నుంచి విజయవాడకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం మీదుగా వందేమాతరం నడిపితే మూడు రాష్ట్రాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని విన్నవించారు. ఇంకా పలు సమస్యల గురించి ప్రస్తావించి పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఏజీఎం మాట్లాడుతూ తులసీనాథ్ అభ్యర్థనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న మునస్వామి

రామకుప్పం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నేతలు, కార్యకర్తలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని జయప్రదం చేయాలని రామకుప్పం టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, కోరారు. సోమవారం రామకుప్పంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, సంక్షేమం కొందరికే పరిమితమైందన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో అభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ చిన్నకృష్ణ, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, నేతలు రామ్మూర్తి, గంట్లప్పగౌడు, నాగభూషణం, గుర్రప్ప, మహ్మద్‌రఫీ, గజేంద్ర, కామరాజనాయక్, రవిరెడ్డి, నవీన్, వెంకటరమణ, ఆనందరెడ్డి, పెరుమాళ్, రఘు, కృష్ణారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, మహేంద్ర నాయుడు, మణేష్, శ్రీనాథరెడ్డి, బాలరాజు, ఆదిల్. అవినాష్, సతీష్, కుమార్, మంజునాథరెడ్డి, మురళీ, ఆంజి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రికార్డుల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న జయశంకర్

పలమనేరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలం కొలమాసనపల్లి పీహెచ్‌సీలో సోమవారం సబ్ యూనిట్ అధికారి జయశంకర్ రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్ రికార్డులు పరిశీలించిన ఆయన ల్యాబ్ టెక్నీషియన్‌కు పలు సూచనలు చేశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అనూహి, ల్యాబ్ టెక్నీషియన్ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ రాణి, ఏఎస్‌ఎం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

15న కలెక్టరేట్ ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ అధ్యక్షులు రత్నారెడ్డి

పలమనేరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకొస్తున్న పెన్షన్ సవరణ బిల్లును నిలిపి వేయాలని దేశవ్యాప్తంగా ఈనెల 15న చేపడుతున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలమనేరు పెన్షనర్ల సంఘ అధ్యక్షులు రత్నారెడ్డి కోరారు. సోమవారం పలమనేరు పెన్షనర్ల సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి దొరస్వామి, పలమనేరు పెన్షనర్ల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సోమలలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

సోమల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మంగళవారం ప్రారంభించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

286 మందికి ఉచిత వైద్యసేవలు



రోగులకు చికిత్సలందిస్తున్న వైద్యులు

రామకుప్పం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం పీఈఎస్ ఆస్పత్రి, విజలాపురం ధార్మిక్ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం విజలాపురం పీహెచ్‌సీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 286 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్సలందించారు. మెరుగైన వైద్యం కోసం పలువురు రోగులను పెద్దాస్పత్రులకు రెఫర్ చేశారు. శిబిరంకు వచ్చిన రోగులకు టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు కుమార్ ఉచిత భోజన వసతి కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పూజిత, హెల్త్ అసిస్టెంట్ బాలు, ధార్మిక్ సేవాసమితి అధ్యక్షుడు మహేష్ పీఈఎస్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో వ్యాధులు దూరం



రోగులకు మందులు అందజేస్తున్న మదనపల్లె వైద్యులు

పుంగనూరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని మదనపల్లె బెటర్ లైఫ్ ఆయుర్వేదిక్ డాక్టర్లు దివ్య, దీప్తి పేర్కొన్నారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో ఏపీ స్టేట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారి సహకారంతో మదనపల్లె బెటర్ లైఫ్ ఆయుర్వేదిక్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయుర్వేద మందులతో మోకాళ్ల, నడుము, ఆస్మా తదితర వ్యాధులు దూరమవుతాయని వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం, నారాయణరెడ్డి, భరత్‌భూషణ్, రామలింగప్ప, మునివెంకటప్ప, సునంద, దినేశ్, చిన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



వసతి గృహాల నిర్మాణాలను పరిశీలిస్తున్న మునీంద్రనాయక్ తదితరులు

పుంగనూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మునీంద్రనాయక్, బీజేపీ నేత అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించిన ఘనత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.13 కోట్లు నిధులు కేటాయించినట్లు తెలిపారు. గతంలో ఎస్సీ, ఎస్టీ నిధులను పక్కదారి పట్టిస్తే కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కులాలకు ఖర్చు చేసి అభివృద్ధి చేస్తున్నట్లు కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు చందన, ఏఎస్‌డబ్ల్యూవో శ్రీరాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

● మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి



చీకలచేనులో మహిళలు, చిన్నారులతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి



మాగాండ్లపల్లెలో పర్యటిస్తున్న టీడీపీ నాయకులు

సదుం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలిసి సదుం మండలం చీకలచేను పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుంగనూరు అభివృద్ధికి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంటోందన్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమంపై కరపత్రాలను పంపిణీ చేస్తూ సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సునీల్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మహేశ్వర్ రెడ్డి, కుమార్, మనోజ్, అశోక్ కుమార్ రెడ్డి, వెంకటస్వామి, పవన్ కుమార్ రెడ్డి, జ్యోతి, ధనంజయ, సుబ్బరాజు, చంద్రమౌళి, ఆనంద రెడ్డి, బాలకృష్ణ, కిరణ్, రెడ్డిప్రసాద్‌రెడ్డి, కేశవరెడ్డి, సురేంద్ర, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు పని చేస్తున్నట్లు పుంగనూరు టీడీపీ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మాగాండ్లపల్లెలో ఇంటింటా తిరిగి ప్రజా సమస్యలను గుర్తించారు. గుర్తించిన సమస్యలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. నాయకులు గంగాధర్, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, మాధవ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణ పరిధిలో కౌన్సిలర్ రామకృష్ణమరాజు, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారు.

సమాన లింగ నిష్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో గంగాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో గంగాదేవి, ఆర్డీవో తదితరులు

కుప్పం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సమాన లింగ నిష్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో గంగాదేవి అన్నారు. కుప్పం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆర్డీవో శ్రీనివాసరాజుతో కలిసి ఆమె వైద్యాధికారులు, ఎన్జీవో కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భండీ డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో మాట్లాడుతూ కుప్పం డివిజన్‌లో ఆడ, మగ లింగ నిష్పత్తి 896/1000 గా ఉందన్నారు. ఈ నిష్పత్తి చాలా తక్కువగా ఉండటం ఆందోళనకరమన్నారు. లింగ ఎంపిక, లింగ నిర్ధారణ చేయడం నేరమని సూచించారు. లింగ నిష్పత్తి సమానం చేయాలంటే గర్భస్రావాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ల్యాబ్‌లు, ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ జరుతుంటే గుర్తిం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అబార్షన్ మాత్రలు సరఫరా చేసే అవకాశం ఉన్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలు, క్వాక్స్‌పై మెడికల్, ఐసీడీఎస్, పోలీసు విభాగాలు ప్రత్యేకంగా నిఘా ఉంచాలన్నారు. లింగ నిర్ధారణ, ఎంపికకు పాల్పడే వారిపై నిఘా ఉంచి వారి సమాచారం అందించిన వారికి రూ.లక్ష రూపాయల నగదు బహుమతిని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్డీవో శ్రీనివాసరాజు మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేసిన స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీసీపీఎన్డీటీ చట్టంలోని శిక్షా నిబంధనలపై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. డీఎస్పీ పార్థసారథి మాట్లాడుతూ లింగ ఎంపిక కోసం గర్భస్రావాలు చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఎన్జీవో కమిటీ సభ్యులు, లైన్ డిపార్టుమెంట్ అధికారులు, పోలీసు, విద్య, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి రోజూ గంట కేటాయించాలి

● కడా పీడీ వికాస్ మర్మత్



అర్జీలు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్



పలమనేరులోఅర్జీ స్వీకరిస్తున్న ఆర్డీవో పి.భవాని

కుప్పం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు రోజూ కనీసం గంట సమయం కేటాయించాలని కడా పీడీ వికాస్ మర్మత్ ఆదేశించారు. స్థానిక మండల సచివాలయం సమావేశపు హాలులో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీడీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పింఛన్లు, భూమి, ఉద్యోగ, ఆరోగ్య సమస్యలు తదితర అంశాలకు సంబంధించి 41 వినతులు ప్రజల నుంచి ఆయన స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించిన పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అనేక సమస్యలపై అర్జీలు అందుతున్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి కచ్చితంగా రోజులో గంట సమయం కేటాయించాలని ఆదేశించారు. ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించి తీరాలని చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరు పరిధిలోని ప్రజలు పలు సమస్యలపై సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో భవానికి అర్జీలు అందించారు. ఆయా మండలాల తహసీల్దార్లతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం



కల్యాణోత్సవంలో సీతాలక్ష్మణ సమేత రాముడు

రామకుప్పం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ప్రారంభమైన అఖండ శ్రీరామ నామస్మరణ కార్యక్రమం సోమవారం ఉదయం ముగిసింది. ఈ సందర్భంగా సాయంత్రం స్థానిక ఆర్‌కే కల్యాణ మండపంలో నిర్వాహకులు సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

ఘనంగా ఎల్లమ్మ కొలుపు



పూజా సామగ్రిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

సోమల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడింపల్లెలో కొలువుతీరిన నంద్యాల ఎల్లమ్మ దేవత ఆలయంలో సోమవారం కొలుపు వేడుకలు ఘనంగా జరిగాయి. తొలి ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు ఉపవాస దీక్షలతో చెన్నమల్లయ్యతాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. నడింపల్లె, కరకమంద, సూరయ్యగారిపల్లె, సోమల, చెన్నయ్యగారిపల్లె, సదుం, గట్టువారిపల్లె తదితర గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఉభయదారులు జీఎల్.మోహన్‌కుమార్, జీఎల్.శ్రీదేవి (జిల్లా జడ్జి) కుటుంబ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన పులిచెర్ల నాయకులు



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న తహసీల్దారు జయసింహ

కల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి పంచాయతీ పరిధిలో సోమవారం రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలిసి పులిచెర్ల మండలంలోని టీడీపీ నాయకులు కలిశారు. పులిచెర్ల మండలంలోని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా నాయకులు కృషి చేయాలన్నారు. అనంతరం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన తహసీల్దారు జయసింహ శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, రాష్ట్ర టీడీపీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ మురళీధర్, నాయకులు కుమార్‌రెడ్డి, ధనంజయనాయుడు, మురళీధర్‌నాయుడు, ప్రభాకర్, రమేష్, మహేష్ పాల్గొన్నారు.

శివుడికి అన్నాభిషేకం

రొంపిచెర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల సమీపంలోని కట్టశివాలయంలో సోమవారం స్వామివారికి అన్నాభిషేకం చేశారు. వారనాసివారిపల్లెకు చెందిన శ్రీనివాసులు దంపతులు స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి మునిరాజశర్మ తీర్థ ప్రసాదాలు అందించారు.

పోలీసులకు డ్రోన్ కెమెరా వితరణ



డ్రోన్ కెమెరాను అందిస్తున్న మదర్ థెరిసా కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు

గంగవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తమవంతు సహకారంగా అత్యాధునిక టెక్నాలజీతో కూడిన సుమారు రూ.1.50 లక్షల విలువైన డ్రోన్ కెమెరాను పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్‌కు సోమవారం మదర్‌థెరిసా కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు అందించారు. చోరీలను నివారించడానికి దాతలు సీసీ కెమెరాలను అందించి పోలీసు శాఖకు సహకరించాలని డీఎస్పీ కోరారు. కార్యక్రమంలో గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్, కళాశాల ఛైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు చదువులో రాణించాలి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దాతలు

సోమల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదివి రాణించాలని ఎంఈవో శివరత్న కోరారు. సోమవారం నెల్లిమంద పాఠశాలలో తెట్టుపల్లెకు చెందిన దాత మోదిన్‌బాషా కుటుంబ సభ్యులు 150 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, బ్యాగులు, ప్లేట్లు అందజేశారు. దాత మోదిన్‌బాషాను ఉపాధ్యాయులు సన్మానించారు. ఎగువపల్లె, బోయపల్లె, నవాబ్‌పేట పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాసామగ్రి అందించారు. హెచ్‌ఎం. ఎల్లయ్య, శ్రీనివాసులు, విశాంత్ర హెచ్‌ఎం. పగడాల లక్ష్మీపతి, నాగరాజ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పుంగనూరులో విద్యార్థుల అవగాహన ర్యాలీ

పుంగనూరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నా రు. సోమవారం స్థానిక కాలేజీ నుంచి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ నినాదాలు చేస్తూ పట్టణంలో అవగాహన ర్యాలీ చేశారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు సోమరాజు, అనిల్‌కుమార్, అంజనేయరెడ్డి పాల్గొనారు.

సింహ వాహనంపై కోదండరాముడి విహారం



తవణంపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): టి.పుత్తూరు కోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివార సింహవాహనంపై విహరించారు. ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఊంజల్‌సేవ నిర్వహించాక సింహ వాహనంపై మేళతాళాల నడుమ్మ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు, ఉభయదారులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తాం: టీడీపీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న భీమనేని చిట్టిబాబు నాయుడు

పాలసముద్రం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి గ్రామాన్నీ అభివృద్ధిపథంలో నడిపిస్తారని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు పేర్కొన్నారు. సోమవారం బలిజకండ్రిగలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తారని తెలియజేశారు. టీడీపీ చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి వాసునాయుడు, రాజేంద్రన్, జె.విజయ్‌కుమార్,వెంకటేశులునాయుడు,వాసుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోండి

గుడిపాల, జూలై 7(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్, సీనియర్ అసిస్టెంట్‌పై జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలాజీనాయుడు, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు శంకర్‌చౌదరి సోమవారం ఫిర్యాదు చేశారు. వీరు ప్రజలకు అందుబాటులో లేకుండా ఉండటంలేదని పేర్కొన్నారు. మామిడి రైతులు క్యూలో ఉన్నా వైసీపీ నాయకులు చెబితే కొందరికి టోకెన్లను అందిస్తున్నారని ఆరోపించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఎంపీటీసీ గోళ్లహరిప్రసాద్‌చౌదరి, టీడీపీ నాయకులు బాలసుబ్రహ్మణ్యంయాదవ్, చందు, దొరబాబు,నిత్యానంద యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



యాదమరి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పలు ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం స్పందన ఫౌండేషన్ సంస్థ నిర్వాహకురాలు శ్యామలాదేవి విద్యాసామాగ్రిని వితరణ చేశారు. సొసైటీ ఫర్ రూరల్ అర్బన్ ఎకనామిక్, సోషియల్ హేబిటేషన్ సంస్థ ప్రతినిధి స్టాన్లీ రూ.40 వేల విలువ చేసే విద్యాసామగ్రి అందజేశారు. కీనాటంపల్లి, వరిగపల్లి, వరదరాజులపల్లి, కోడిగుట్ట, ఓటివారిపల్లె పాఠశాల విద్యార్థులకు అవసరమైన నోటుపుస్తకాలు, పెన్నులు తదితర సామాగ్రి అందజేశారు. ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, వల్లేరు అమర్‌నాథ నాయుడు, వల్లేరు హరి నాయుడు, పీఆర్టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పశుగ్రాస రకాలపై అవగాహన అవసరం



పశుగ్రాస క్షేత్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ గోవిందయ్య

వెదురుకుప్పం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పశుగ్రాస రకాలపై పాడిరైతుల్లో అవగాహన అవసరమని పుత్తూరు పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ టి.గోవిందయ్య సూచించారు. సోమవారం కార్వేటినగరం మండలం అన్నూరు, పాదిరికుప్పం ప్రాంతాల్లో పశుగ్రాస క్షేత్రాలను డాక్టర్లు జగదీష్, హేమకుమార్, కృష్ణ, ఉద్యోగులు, రైతులతో కలసి ఆయన సందర్శించారు. పశుగ్రాస రకాలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. చాప్‌కట్టర్ గురించి పాడిరైతులకు తెలియజేశారు.

అంగన్వాడీల సమ్మె నోటీసు



నోటీసు ఇస్తున్న అంగన్వాడీ వర్కర్ల యూనియన్ నేతలు

వెదురుకుప్పం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న సమ్మె చేస్తున్నామని సోమవారం కార్వేటినగరం సీడీపీవో పగడాల శోభారాణికి ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రాజెక్టు అధ్యక్షురాలు కె.విజయ, కోశాధికారి ఎస్.లక్ష్మీనరసమ్మ తమ నాయకులతో కలసి నోటీసును అందజేశారు. అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు, లబ్ధిదారులకు ఫేస్ యాప్ రద్దుచేయాలని నోటీసులో పేర్కొన్నారు.

న్యాయ వ్యవస్థపై ట్రోలింగ్ సరికాదు

పూతలపట్టు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థపై దాడి సరికాదని చిత్తూరు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్ రెడ్డి ప్రకటనలో ఖండించారు. హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ రెడ్డిపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్స్ సంబంధించి హైకోర్టు న్యాయమూర్తులపై, న్యాయవ్యవస్థపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ట్రోలింగ్‌కు పాల్పడుతున్న వారిపై తగుచర్యలు తీసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంతోత్సవం

వెదురుకుప్పం, జూలై 7(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ద్రౌపది అమ్మవారి మహాభారత ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో సోమవారం ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. వసంతోత్సవం నేపథ్యంలో అమ్మవారిని ఊరేగించారు.

గ్రామాల్లో పారిశుధ్య పనుల పరిశీలన



చెర్లోపల్లెలో గ్రామస్తులతో మాట్లాడుతున్న బృందం సభ్యుడు

తవణంపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లెలో స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం సభ్యులు సోమవారం పర్యటించారు. పంచాయతీలో పారిశుధ్యం పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, పంచాయతీ కార్యాలయం, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌లో నిర్వహిస్తున్న పారిశుధ్యం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపీడీవో మురగేషన్, సర్పంచ్ సుధాకర్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. **పాలసముద్రం:** పాలసముద్రం ఆరోగ్య కేంద్రం, శ్రీకావేరిరాజుపురంలోని ఎస్‌డబ్ల్యూపీసీని స్వచ్ఛ భారత్ మిషన్ బృందం పరిశీలించింది. దీనబంధుపురంలో తాగునీటి సరఫరా, చెత్త సేకరణ, మరుగుదొడ్ల వినియోగంపై అడిగి తెలుసుకుంది.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), జూలై 7(ఆంధ్రజ్యోతి): కాణిపాకం ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణట్రస్టుకు బెంగళూరుకు చెందిన గోపాల్‌రెడ్డి సోమవారం రూ.1,00,105 విరాళంగా అందించారు. విరాళదాతను ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

పాలసముద్రం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శ్రీబొమ్మరాజుపురంలో సోమవారం ఆ సంస్థ జెండాను జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి కిషోర్‌మాదిగ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణమాదిగ మాదిగల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. రాష్ట్రంలో మాదిగలకు గుర్తింపు తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు మురళి, ప్రకాష్, నరసింహులు, పులిగోరుబాబు, మురగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా మధుసూదన్



తన నియామక పత్రాన్ని ఎంపీడీవో చంద్రమౌళికి అందిస్తున్న మధుసూదన్

వెదురుకుప్పం, జూలై 7(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం డిప్యూటీ ఎంపీడీవోగా బుక్కాపట్నం మధుసూదన్‌ని నియమితులయ్యారు. జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. జడ్పీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న మధుసూదన్‌కి ప్రమోషన్ లభించిన క్రమంలో డిప్యూటీ ఎంపీడీవోగా నియమించారు. మధుసూదన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ అంతకు ముందుగా ఈవో నాగరత్నమ్మ ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవోగా వ్యవహరించారు.

హెలిప్యాడ్ ఏర్పాట్ల పరిశీలన



హెలిప్యాడ్ పనులను పరిశీస్తున్న పెద్దిరెడ్డి తదితరులు

బంగారుపాళ్యం,జూలై7(ఆంధ్రజ్యోతి): జగన్ బంగారుపాళ్యం పర్యటన నేపథ్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి కొత్తపల్లె వద్ద హెలిప్యాడ్ పనులను సోమవారం పరిశీలించారు. రోడ్డుషో జరిగే మార్గాన్ని, మార్కెట్ యార్డులో రైతులతో ముఖాముఖి జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. ఈయనతో పాటు జడ్పీ ఛైర్మెన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ రఘురాం, పూతలపట్టు నియోజక వర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి,విజయానందరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ధర్మరాజు తిరునాళ్ల



నగరి, జూలై7 (ఆంధ్రజ్యోతి) కృష్ణారామాపురంలో ద్రౌపదీదేవి సమేత ధర్మరాజ తిరునాళ్ల వైభవంగా జరిగింది. వారం రోజులు జరుగుతున్న ఈ వేడుక సోమవారం అమ్మవారి ఊరేగింపుతో ముగిసింది. ఊరేగింపుగా వచ్చిన అమ్మవారికి గ్రామ ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు.

ఎక్స్‌రే గది ఏర్పాటుకు రెడ్‌క్రాస్ సహకారం



రెడ్‌క్రాస్ రూం వద్ద రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

పెనుమూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పెనుమూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఎక్స్‌రేకి గది ఏర్పాటుకు రెడ్‌క్రాస్ సొసైటీ ముందుకొచ్చింది. కేశవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీధర్‌రెడ్డి ఇందుకు అంగీకరించారు. ప్రతి నెలా నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత్ మంత్రిత్వ అభియాన్ రోజున గర్భిణులకు భోజనం కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రేడియాలజీ డాక్టర్ సంధ్యతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆకతాయిల దాడిలో యువకుడికి గాయాలు



గాయపడిన ప్రభాకర్

వెదురుకుప్పం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఓయువకుడిపై కొందరు ఆకతాయిలు దాడి చేసి గాయపరిచారు. సీఐ హనుమంతప్ప కథనం ప్రకారం కార్వేటినగరం కోట చెరువు కాలనీకి చెందిన ప్రభాకర్ సోమవారం బైక్‌లో చెల్లెల్ని ఎక్కించుకుని ఇంటికి వెళుతుండగా బీసీ కాలనీకి చెందిన కొందరు యువకులు అల్లరిగా ప్రవర్తించారు. దీంతో బైక్ నిలిపి ప్రభాకర్ ప్రశ్నించడంతో ఆ యువకులు అతడి తలపై కొట్టి గాయపరిచారు. ప్రభాకర్‌ను తిరుపతికి 108 అంబులెన్స్‌లో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.





నిన్న మొన్నటి వరకూ కొత్తకోటలో అధ్వానరోడ్డు ఇలా- సీసీ రోడ్డు నిర్మాణంతో రూపుమారిందిలా..

నాడు అధ్వానంగా..నేడు అద్దంలా..

గుడిపాల, జూలై 7(ఆంధ్రజ్యోతి): నారగల్లు పంచాయతీ కొత్తకోటలో సుదీర్ఘకాల సమస్య పరిష్కారమైంది. చాన్నాళ్లుగా గుంతలమయమైన మట్టి రోడ్డు కష్టాలు తీరాయి. సీసీ రోడ్డు వేయాలని గతంలో పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చినా ప్రయోజనం లేకపోయిందని గ్రామస్తులు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారని వీరు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రతి హామీ నెరవేరుస్తాం: ఎమ్మెల్యే గురజాల



దళితవాడలో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం చెప్పిన ప్రతీదీ చేసి చూపిస్తుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా ఛైర్మన్ కటారి హేమలత, డీసీసీబీ ఛైర్మన్ అమాసరాజశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం నారగల్లు, ఏఎల్.పురం, వెంగమాంబాపురం, రామాపురం గ్రామ పంచాయతీల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నారగల్లు కొత్తకోటలో మాతమ్మ ఆలయానికి రూ.25 వేలు విరాళంగా అందించారు. దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా వితరణ చేశారు. కొత్త దళతవాడ, వెంగమాంబాపురం దళితవాడలో ఆర్వో వాటర్ ప్లాంటును ప్రారంభించారు. వెంగమాంబాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో మేయర్ అముద, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శిరీష, టీడీపీ నేతలు బాలాజీనాయుడు, అనిల్‌కుమార్, నాగరాజుయాదవ్, హరి, విజయ్‌నాయుడు, రూప్‌కుమార్, హరిప్రసాద్, రెడ్డెప్ప, గురప్ప, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులూ సమయపాలన పాటించండి



కార్వేటినగరంలో నిర్దేశిత సమయానికి తెరుచుకోని గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం

వెదురుకుప్పం, జూలై 7(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గృహ నిర్మాణశాఖ సంస్థ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కూడా నిర్ణీత సమయం కన్నా ఆలస్యంగా వచ్చారన్నారు. సమయపాలన పాటించకపోవడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉన్నతస్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే ఇలా జరుగుతోందని విమర్శించారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న సునీష్ కుమార్, చంద్రశేఖర్ తదితరులు

చిత్తూరు సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విద్యుత్ కార్మిక సంఘం(3045) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీష్ కుమార్, చంద్రశేఖర్ చెప్పారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు వారు మాట్లాడుతూ 2022 వేతన సవరణలో పెరిగిన జీతభత్యాల బకాయిలను వెంటనే ఇవ్వాలని కోరారు. 25 నుంచి 30 సంవత్సరాలు పనిచేసిన రిటైరైన కార్మికులకు ఆర్థికంగా న్యాయం చేయాలని కోరారు. ప్రమాదాల బారిన పడుతున్న కార్మికులకు, పర్మినెంట్ ఉద్యోగుల తరహాలో మెడికల్ రిస్క్ కవరేజ్ ఇవ్వాలని, విద్యుత్ సంస్థలో మూడు దశాబ్దాలకు పైబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల క్రమబద్ధీకరించాలని కోరారు. రాష్ట్ర నేతలు సుధాకర్, రూప్ కుమార్, అంకయ్య, శరవణ, రుద్దేశ్, రజని తదితరులు పాల్గొన్నారు.

పవన్‌పై అనుచిత పోస్టు: జన సైనికుల ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు అందజేస్తున్న జనసేన నాయకులు

వెదురుకుప్పం, జూలై 7(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై తన ఇన్‌స్టాగ్రామ్‌లో అనుచిత పోస్టు పెట్టిన నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కార్వేటినగరం సీఐ ఎస్.హనుమంతప్పకు ఆ పార్టీ నాయకులు శోభన్‌బాబు, డాక్టర్ యుగంధర్ పొన్న సహా జనసైనికులు వెళ్లి ఫిర్యాదు చేశారు. సీఐ మాట్లాడుతూ దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

ప్రశ్నిస్తే అక్రమకేసు: కృపాలక్ష్మి

గంగాధరనెల్లూరు: అధికార పార్టీ తప్పులను ప్రశ్నించినందుకుగాను తనపై అక్రమంగా పోలీసు కేసు నమోదు చేశారని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ధ్వజమెత్తారు. గంగాధరనెల్లూరులో నేతలతో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు ఇన్‌స్టా అకౌంట్ లేకపోయినా ప్రాథమిక విచారణ చేయకుండా ఏవిధంగా కేసు నమోదుచేస్తారని ప్రశ్నించారు.

పార్టీ కోసం కష్టపడినవారికే పదవులు: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న గంజి మాధవయ్య

పెనుమూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడిన వారికే నాయకుల సమన్వయంతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పదవులు ఇస్తామని టీడీపీ మండల సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు గంజి మాధవయ్య తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని 25 పంచాయతీలకు సంబంధించిన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల కమిటీలకు ఆశావహులు తమ పేర్లను రాసి ఇస్తే పరిశీలించి పార్టీ పెద్దలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, నాయకులు లోకనాథనాయుడు, హరిబాబు నాయుడు,తలారిరెడ్డెప్ప, కార్జాల అరుణ, కలికిరి కొండ మాజీ ఛైర్మెన్ ఈశ్వర్‌ప్రసాద్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడి మృతి

బంగారుపాళ్యం, జూలై 7(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందాడు. సోమవారం రాత్రి చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో కొత్తపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఈ ప్రమాదం జరిగింది. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎన్పీ ధరణీప్రసాద్

బంగారుపాళ్యం,జూలై 7(ఆంధ్రజ్యోతి): చీకూరుపల్లె పంచాయతీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారంమండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటింటికీ నాయకులు తిరిగారు. నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధిపై కరపత్రాల ద్వారా వివరించారు. జనార్ధగౌడ్, కోకా ప్రకాష్ నాయుడు,బాలసుబ్రమణ్యం, హరిప్రసాద్,సూరినాయుడు,రమేష్, రవి,భారతి,కిశోర్ పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రామానాయుడు

చిత్తూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): నగరిలో ఈ నెల 9,10,11 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్గ సభ్యుడు రామానాయుడు కోరారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వ సంస్థల ధ్వంసం చేయడం, నిత్యావసర వస్తువుల ధరలు పెంచడం, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరించడం వల్ల అన్ని వర్గాలు అసంతృప్తితో ఉన్నాయన్నారు.సీపీఐ నాయకులు నాగరాజు, గోపీనాథ్, విజయగౌరీ, కోదండ, రఘు, బాలాజీరావు పాల్గొన్నారు.

కలెక్టర్ బంగ్లా ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

చిత్తూరు అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ బంగ్లా ప్రహరీ నిర్మాణానికి సోమవారం భూమి పూజ జరిగింది. ఇటీవల రోడ్డు విస్తరణలో భాగంగా ప్రహరీ తో పాటు కొంత స్థలాన్ని రోడ్డు భవనాల శాఖ అధికారులు గుర్తించి నివేదించారు. ఈక్రమంలోనే కొత్త ప్రహరీ గోడ నిర్మాణానికి సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌లు భూమి పూజ చేశారు. కార్యక్రమానికి కమిషనర్ నరసింహప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ



అర్జీదారుతో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో సోమవారం కమిషనర్ నరసింహ ప్రసాద్ అధ్యక్షతన పీజీఆర్‌ఎస్ కార్యక్రమం జరిగింది. ఇంజనీరింగ్‌శాఖకు 3, పింఛన్లకు 3, రెవెన్యూశాఖకు ఒక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

10న గురుపౌర్ణమి

చిత్తూరు కల్చరల్, జూలై7(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 10న గురుపౌర్ణమి నిర్వహించనున్నారు. కట్టమంచి విశ్వసాయి షిరిడిసాయి, కుమ్మరవీధి, జీకేనగర్ ఆలయాలతోపాటు పలు విద్యాసంస్థలల్లో గురుపూజోత్సవం నిర్వహించనున్నారు. గిరింపేట సుబ్రమణ్యేశ్వరస్వామి, సత్యసాయి సంస్థాన్‌లలో గిరి ప్రదక్షణ, పల్లకీ సేవలు నిర్వహించనున్నారు.

కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



చిత్తూరు సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ జన్మదినాన్ని ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక వెంగళరావు కాలనీలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేసి, జెండా ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు సురేష్, కాటయ్య, విద్య, నేతాజి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

విజయపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): మాధవరం పంచాయతీ పన్నూరు సబ్‌స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ భైరవుడు తెలిపారు. పలు కంపెనీ ప్రతినిధులు హాజరవుతారన్నారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామ స్వరాజ్ అభియాన్‌పై శిక్షణ

విజయపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకంపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రాజేంద్ర తెలిపారు.